క్లుప్తంగా

ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని తండ్రికి ఆర్థిక సహాయం అందిస్తున్న పీఆర్, హౌసింగ్ ఏఈలు

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచు ఎర్రగుడి సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బాపనదొడ్డి గ్రామానికి చెందిన రాజశేఖర్ ఈ నెల 28న అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం మృతుని ఇంటికి వెళ్లిన పంచాయతీ రాజ్ ఏఈ అబ్దుల్ వహీద్, ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ అనిల్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మృతుని తండ్రి హనుమంతుకు రూ.1,26,300 ఆర్థిక సాయం అందించారు. జిల్లాలోని పీఆర్, అసిస్టెంట్‌ల సహకారంతో నగదు సమకూర్చినట్లు పీఆర్ ఏఈ తెలిపారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

పనులు నిలిచి.. ముప్పు పొంచి



భవన నిర్మాణం కోసం ఉంచిన రాళ్ల వద్ద ఆడుకుంటున్న విద్యార్థులు

చిప్పగిరి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నిలిచిపోవడంతో అక్కడ ఉంచిన రాళ్లు, కడ్డీలు, పునాది వరకు నిర్మించిన భవనం విద్యార్థులకు ప్రమాదకరంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో నాడు – నేడు కింద పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపి వేయడంతో భవన నిర్మాణం కోసం తీసిన పునాదులు, వేసిన పిల్లర్లు అలానే వదిలేశారు. దీంతో పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు ఆడుకుంటూ ఎప్పుడు గుంతలో పడతారో, ఎక్కడ ఇనుప కడ్డీలు గుచ్చుకుంటాయోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం భవన నిర్మాణం చేపట్టిన ప్రాంతం వైపు విద్యార్థులు వెళ్లకుండా కంచె ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

కొలువుదీరిన పీర్లు



పెద్దమసీదు చావిడిలో కొలువుదీరిన పీర్లు

వెల్దుర్తి(కృష్ణగిరి): మొహర్రంను పురస్కరించుకుని మండలంలోని పలు చావిడిల్లో పీర్లు కొలువుదీరాయి. మంగళవారం అర్ధ రాత్రి వెల్దుర్తి పట్టణంలోని పెద్ద మసీదు పీర్ల చావిడిలో భారీ ఇమాం, మౌలాలి స్వామి పీర్లు, ముల్ల గేరిలో లాల్‌సా పీరును కొలువుదీర్చారు. పట్టణంలోని ఆరు పీర్ల చావిడిలతోపాటు అల్లుగుండు, పుల్లగుమ్మి, కలుగొట్ల, నార్లాపురం, కృష్ణాపురం, సూదేపల్లె, గోవర్ధనగిరి తదితర గ్రామాల్లో పీర్ల పండుగను ఘనంగా జరుపుకుంటారు. ఆయా గ్రామాల్లో బుధ, గురువారాల్లో పీర్లు కొలువుదీరాయి. ఈనెల 13,14, 15, 16వ తేదీల్లో సరిగెత్తులు ఘనంగా నిర్వహించనున్నారు. ఈనెల 17న పీర్లు ఏటికి సాగనున్నట్లు నిర్వాహకులు ముల్ల బషీర్ తెలిపారు. ఎస్‌ఐ సునీల్ కుమార్ బుధవారం పలు గ్రామాల పీర్ల చావిడిలను పరిశీలించారు. గొడవలకు తావు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

ఏటీఎంల వద్ద భద్రత పరిశీలన



వెల్దుర్తి ఎస్‌బీఐ ఏటీఎంను పరిశీలిస్తున్న సీఐ సునీల్‌కుమార్, ఎస్‌ఐ

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణంలోని ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకు తదితర బ్యాంకుల ఏటీఎంల వద్ద భద్రతను బుధవారం సీఐ మధుసూదన్‌రావు, ఎస్‌ఐ సునీల్‌కుమార్ పరిశీలించారు. ఆయా బ్యాంకు మేనేజర్లతో సమావేశమై ఏటీఎంలు, బ్యాంకుల బయట ప్రస్తుతం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల స్థానంలో అధిక సామర్థ్యం కలిగిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా బ్యాంకుల అధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఎస్‌ఐ తెలిపారు. రాష్ట్రంలో పలు చోట్ల బ్యాంకులు, ఏటీఎంల వద్ద జరుగుతున్న దొంగతనాలు, సైబర్ క్రైమ్‌లపై తీసుకుంటున్న ముందస్తు చర్యల్లో భాగంగా భద్రతను పరిశీలించినట్లు పేర్కొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

ఆలూరు: సన్న, చిన్న కారు రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి సారించేలా ఉపాధి హామీ పథకం సిబ్బంది కృషి చేయాలని ఏపీడీ మల్లేశ్వరి ఆదేశించారు. ఆలూరులోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఏపీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో క్లస్టర్ పరిధిలోని ఏపీఓ, టీసీ, ఈసీ, ఎఫ్‌ఏలతో సమావేశమయ్యారు. సాగునీటి వసతి కలిగిన రైతులు పండ్ల తోటల సాగు చేపట్టేందుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తుందని, దీన్ని రైతులకు వివరించాలన్నారు.

వ్యవ'సాయం' ఏదీ..?

- కొత్త ప్రభుత్వంలో రైతులకు అందని సాయం
- పీఎం కిసాన్ నిధులు మాత్రమే జమ
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటు వైఎస్సార్ రైతు భరోసా

మద్దికెర: ఖరీఫ్‌లో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతులు పంటల సాగును ముమ్మరం చేశారు. ఇప్పటికే మద్దికెర మండలంలో 10 వేల ఎకరాలకు గాను 2,500 ఎకరాల్లో విత్తనం వేశారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలి విడత సాయాన్ని అందించింది. గత నెలలో రైతుల ఖాతాల్లో రూ. 2 వేల చొప్పున నగదు జమ అయ్యింది. ఈ మొత్తం ఎరువులు, విత్తనాల కొనుగోలుకు ఉపయోగపడింది. అయితే రాష్ట్ర ప్రభుత్వ సాయం ఇంకా విడుదల కాకపోవడంతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా

రైతులు పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించి అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందించింది. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 మొత్తం కలిపి ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతులకు అందజేసింది. ఇలా రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా సాయాన్ని ఐదేళ్ల పాటు అందించింది.

కౌలు రైతులకూ భరోసా

భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన కౌలుకు భూములను సాగు చేస్తున్న వారికి కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించింది. దీని వల్ల ఎందరో పేద రైతులు లబ్ధిపొందారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటల సాగు చేశారు.

అన్నదాత ఎదురుచూపు

అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు పంటలు సాగు చేయడానికి పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. దుక్కులు దున్నడం, విత్తనాలు కొనుగోలు, ఎరువులకు పెట్టుబడి సాయం అవసరం. ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పెట్టుబడి సాయం రైతులకు ఎంతగానో తోడ్పడింది. ఏటా పీఎం కిసాన్ తొలివిడత సాయం రూ.2 వేలు, వైఎస్సార్ రైతు భరోసా సాయం రూ.3,500ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సాయం రూ.2 వేలు మాత్రమే అందడంతో రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు రూ.20 వేలు ఇస్తామని టీడీపీ, జనసేన మేనిఫెస్టోలో ప్రకటించింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ కొలువుతీరారు. మంత్రులతో తొలి కేబినేట్ బేటీ కూడా ముగిసింది. అయినా రైతుల పెట్టుబడి సాయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



పొలాలను సిద్ధం చేసుకుంటున్న అన్నదాతలు

16న చేపల చెరువుకు వేలం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలో అటవీశాఖ పరిధిలోని వీరన్నగట్టు చెరువులో చేపల పెంపకానికి ఈనెల 16న వేలం నిర్వహించనున్నట్లు కర్నూలు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఓబులేష్ గౌడ్ తెలిపారు. 2024 జులై 1వ తేదీ నుంచి 2025 జూన్ 30వ తేదీ వరకు ఏడాది కాల పరిమితిలో చెరువులో చేపలు పెంచుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.1000 ధరావత్తు చెల్లించి పాల్గొనాలన్నారు. కర్నూలు రేంజ్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు.

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): పశుగ్రాస వారోత్సవాలను పురస్కరించుకుని రైతులకు పశుగ్రాస (గడ్డి) విత్తనాలను సబ్సిడీపై అందించనున్నట్లు వెల్దుర్తి మండల పశువైద్యాధికారి శాంత లత తెలిపారు. రాయితీ పోను 5 కేజీల జొన్న విత్తనాలు రూ.115కు, 5 కేజీల మొక్కజొన్న విత్తనాలు రూ.85తో అందించనున్నట్లు వెల్లడించారు. విత్తనాల బ్యాగులు మండల కేంద్రంలోని పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు తమ వివరాలు తెలిపి గడ్డి విత్తనాలు పొందవచ్చని పేర్కొన్నారు.

పంచాయతీకి తగ్గిన ఆదాయం

హొళగుంద: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీకి చెందిన వారపు సంత మార్కెట్, వాహనాల రుసుము వసూలు, కమేళా, సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ నిర్వహణ తదితర వ్యాపారాలకు బుధవారం వేలం పాటలు జరిగాయి. 2024–25 సంవత్సరానికి సంబంధించి జూలై 10వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు (9 నెలలు) కాంట్రాక్టు ఇచ్చేందుకు సర్పంచ్ చలవాది రంగమ్మ, ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ వేలం పాటలు నిర్వహించారు. వారపు సంత మార్కెట్‌ను మాటసుగూరు ఈశ్వరప్ప రూ.1.38 లక్షలు (గతేడాది రూ.2.25 లక్షలు), బస్టాండులో వహనాల రుసుము వసూలుకు దిడ్డి సిద్దప్ప రూ.2.01,500 (గతేడాది రూ.2.90 లక్షలు), సుజల స్రవంతి పథకం వాటర్ ప్లాంట్‌ను పక్కీరప్ప రూ.30 వేలకు (గతేడాది రూ.27,500) దక్కించుకున్నారు. గత మార్చిలో నిర్వహించాల్సిన ఈ వేలం పాటను ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రస్తుతం నిర్వహించినట్లు సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. దాదాపు 3 నెలలు తరువాత నిర్వహించడం వల్ల ఆదాయం తగ్గినట్లు ఆయన వెల్లడించారు. వేలం దక్కించుకున్న వారు మొత్తం సొమ్మును ఈ నెలాకరుకల్లా చెల్లించాలన్నారు.



హొళగుందలో వేలం పాట నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

వలంటీర్లకు వేతనాలివ్వాలి

ఆలూరు రూరల్: వలంటీర్లకు గత నెల పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ ఆలూరులోని నాలుగు వార్డు సచివాలయాల వలంటీర్లు బుధవారం మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ ప్రకాష్ నాయుడుకు విన్నవించారు. ప్రతి నెల 2వ తేదీ లోపు వలంటీర్ల గౌరవ వేతనం ఖాతాల్లో జమ అయ్యేదన్నారు. ఈ నెల ఇంతవరకు వేతనం అందలేదన్నారు. ఈ సందర్భంగా ఈఓ ప్రకాష్‌నాయుడు మాట్లాడుతూ.. జూన్ నెలకు సంబంధించి వలంటీర్లకు వేతనాల మంజూరుపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదన్నారు. ఉత్తర్వులు అందిన వెంటనే జీతాలు మంజూరు చేస్తామని చెప్పారు. కాగా అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల వేతనం రూ.10 వేలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల సేవలను దూరం పెట్టారు. జూన్ నెల సామాజిక పింఛన్ల పంపిణీకి సైతం వలంటీర్లను దూరంగా ఉంచారు. ప్రస్తుతం వేతనాలు మంజూరు చేయకపోవడంతో వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు.



ఆలూరు ఈఓకు విన్నవిస్తున్న వలంటీర్లు

గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

దేవనకొండ: గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి కళ్యాణ్ సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే పిల్లలకు మలేరియా, డెంగ్యూ, అతిసారా వంటి వ్యాధులు సోకకుండా చూసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, హనుమంతమ్మ, సబ్ యూనిట్ ఆఫీసర్, గర్భిణులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

తుగ్గలి: కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన డిమాండ్ డే కార్యక్రమంలో భాగంగా బుధవారం తుగ్గలిలో తహసీల్దార్ షర్మిలకు వినతి పత్రం అందజేశారు. ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా కార్మిక వర్గం చేపట్టిన పోరాటాల ఫలితంగా మోదీ ప్రభుత్వానికి పార్లమెంటులో సీట్లు తగ్గాయన్నారు. ఇప్పటికైనా లేబర్‌కోడ్లను రద్దు చేసి కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. దేశంలో కీలకమైన రైల్వే, బీఎస్ఎన్ఎల్, బీమా, బ్యాంకింగ్ వంటి రంగాలను ప్రైవేటుపరం చేసే ఆలోచనలు, కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పెంచాలి

పత్తికొండ రూరల్: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పెంచేందుకు టీచ్ టూల్ శిక్షణ ఉపయోగపడుతుందని జిల్లా విద్యాధికారి శ్యాముల్ అన్నారు. బుధవారం పత్తికొండలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కోర్సు డైరెక్టర్ ఎంఈఓ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ సద్వినియోగం చేసుకుని టీచర్లు బోధనా నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. అంతకు ముందు మండల పరిధిలోని పందికోన గ్రామంలో నాడు–నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు వీరాంజినేయులు, రంగన్న, అగస్టీన్, నాగరాజు, మండల పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు బడేసాహెబ్, పరమేష్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు ప్రసాద్, తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల శిక్షణను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ శ్యామ్యుల్

కౌలు రైతులను గుర్తించండి

ఆలూరు రూరల్: 2024–25 ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లకు మండలంలోని కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో అన్ని గ్రామాల వీఆర్వోలు పొలాలను సాగు చేస్తున్న కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో 550 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని నిర్ణయించారన్నారు. ఈ నెల 19వ తేదీ లోపు కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

హాలహర్వి: అర్హులైన కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ శివశంకర్ సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో కౌలు రైతులతో సమావేశమమై గుర్తింపు కార్డులపై అవగాహన కల్పించారు. దాదాపు 12 మంది కౌలు రైతులను గుర్తించినట్లు ఏఓ తెలిపారు. వారు స్థానిక రైతు సేవా కేంద్రంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అలాగే మండలంలోని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏఓ శివశంకర్

ఆలయ పాలకమండలి రాజీనామా



రాజీనామా పత్రాలను ఆలయ అర్చకులకు అందజేస్తున్న మండలి చైర్మన్, సభ్యులు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ఉన్న రంగనాథస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ దస్తగిరిగౌడ్, సభ్యులు బుధవారం తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఆలయ అర్చకుడు రంగస్వామికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవాలయాన్ని భక్తులు, గ్రామస్తుల సహకారంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. భక్తుల నుంచి రూ.13 లక్షల విలువ చేసే స్థలాన్ని తీసుకున్నామని.. విరాళాల ద్వారా ఆలయంలో రూ.13 లక్షలతో బండపరుపు, రూ.5 లక్షలతో దేవాలయం ఎదుట షెడ్డు, రూ.2.50 లక్షలతో గుడి చుట్టూ వరండా, రాతి ద్వారం నిర్మించినట్లు వెల్లడించారు. అలాగే ఆలయంలో రూ.65 లక్షలతో తూర్పు, దక్షిణ గోపురాల నిర్మాణాల పనులు చేశామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలు, భక్తులు, గ్రామస్తులతో పాటు తమకు అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్‌చార్జి కార్యదర్శిగా విజయ్

మద్దికెర: మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు సర్పంచ్ సుహాసిని బుధవారం తెలిపారు. గతంలో ఇన్‌చార్జిగా ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి ఉండేవారని.. అయితే జిల్లా అధికారులు సీనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

దేవనకొండ: బీజేపీ ప్రభుత్వం నిరంకుశంగా పార్లమెంట్‌లో చర్చ లేకుండా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వీరశేఖర్, సీఐటీయూ మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం దేవనకొండలో తహసీల్దార్ కార్యాలయం వరకు ధర్నా నిర్వహించి మాట్లాడారు. స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలన్నారు. దేశంలో లక్షలాదిగా ఉన్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించి జీతంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు, ప్రజా సంఘాల నాయకులు మహబూబ్‌బాషా, లక్ష్మిరెడ్డి, ఇనాయతుల్లా, సుధాకర రవీంద్ర, కౌలుట్ల స్వామి, సుంకన్న, వరలక్ష్మి, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో హొళగుంద తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు, సీనియర్ నాయకులు వెంకటేశ్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు లక్ష్మి, సలోమి పాల్గొన్నారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని, పెన్షన్, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌ఐ దినోజ్‌కు వినతి పత్రం అందజేశారు.



ఆర్‌ఐ దినోజ్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్లు

కనీస వేతన చట్టం అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు

ఆలూరు రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు, స్వచ్ఛ భారత్ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేసి వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. కార్మికులకు పనికి తగ్గ వేతనం అందించి వారి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అంగన్‌వాడీ, కార్యకర్తలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి

ఆస్పరి: అంగ్‌వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆస్పరిలో సీఐటీయూ, అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి రామాంజనేయులు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఈరమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఈరమ్మకు వినతి పత్రం ఇచ్చారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే

వెల్దుర్తి(కృష్ణగిరి): కార్మిక హక్కులు సాధించడానికి సీఐటీయూ చేపట్టిన 'డిమాండ్స్ డే' సందర్భంగా సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు బుధవారం వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు సిద్ధపడుతున్నట్లు తెలిసిందని దుయ్యబట్టారు. లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, ప్రైవేటీకరణ, జాతీయ నగదు బదిలీకరణ పథకం ఆపాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, జాతీయ హెల్త్ మిషన్, ఎస్ఎస్ఏ, మెప్మా, ఉపాధిహామీ, నేకో, ఆయుష్, సేంద్రీయ వ్యవసాయం, 108, 104 తదితర రంగాల్లోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, కంటింజెంట్, పార్ట్‌టైం, గెస్ట్ కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ సంఘాల సభ్యులు అలివేలి, లలిత, అనిత, గీత, పద్మావతి, వెంకటేశ్వర్లు, అయ్యస్వామి, వెంకట్‌రాముడు, రిజ్వాన, కృష్ణ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

విద్యార్థి బస్సు నడపాలి

ఆలూరు రూరల్: మండలంలోని కురుకుంద, ముద్దనగేరి తదితర గ్రామాలకు విద్యార్థి బస్సు సర్వీసులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మైనా కోరారు. వారు బుధవారం ఆదోని ఆర్టీసీ డిపో మేనేజర్ రఫీకి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ఆలూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ బాలుర, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాలలలో చదివేందుకు ముద్దనగేరి, కురుకుంద తదితర ప్రాంతాల నుంచి వంద మందికి పైగా విద్యార్థులు వస్తున్నారన్నారు. బస్సు సౌకర్యం లేక ఆటోల్లో ప్రయాణిస్తూ పాఠశాలకు సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. గతంలో ఈ గ్రామాలకు విద్యార్థి బస్సు ఉండేదని కరోనా కారణంగా రద్దు చేశారన్నారు. ఆయా గ్రామాలకు విద్యార్థి బస్సులు నడపాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు గోవర్దన్, నాయకులు గిరిమూర్తి, శశికుమార్, మధు ఉన్నారు.



ఆదోని ఆర్టీసీ డిపో మేనేజర్ రఫీకి వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హాలహర్వి: జెడ్పీటీసీ గ్రాంటు రూ.10 లక్షలతో మండలంలోని నిట్రవట్టి గ్రామంలో సీసీ రోడ్లను బుధవారం ప్రారంభించినట్లు జెడ్పీటీసీ లింగప్ప తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారని, జెడ్పీటీసీ గ్రాంటు కింద సీసీ రోడ్లను వేయిస్తున్నట్లు చెప్పారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ లింగప్ప

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి

ఆలూరు: మొహర్రం వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎఐ బి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆలూరు మండలం ఏ.గోనేహాళ్, అంగస్కల్లు, మనేకుర్తి, కమ్మరచేడు గ్రామాల్లో బుధవారం ఎస్ఐ ఓబులేసుతో కలిసి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. కులమతాలకు అతీతంగా పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. కులాలను రెచ్చగొట్టడం, మద్యం సేవించి ఘర్షణకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.